
# గణపతి

## పాలగుమ్మి పద్మరాజు



'ఓ బొజ్జ గణపతి రా నీకు నే నుండ్రాళ్లు పోసేదరా' అంటూ అందుకున్నాడు చంద్రం. మిగతా కుర్రాళ్లు వంత పాడారు. వాళ్ళంతా రోడ్డుకి ఒక పక్కనించి నడుస్తుంటే తను రెండో పక్కనించి నడుస్తున్నాడు. వాళ్ళమీద అక్కసు, దారిపక్క రాళ్ళమీద చూపిస్తున్నాడు బూట్లకాళ్ళతో తన్నుతూ. లతక్కయ్య వాళ్ళతో కలిసి వంతపాడలేదుగాని, కలిసి నడుస్తోంది. అసలు ఆమె చంద్రం గాడితో జతెందుకు కట్టాలి? వాడు ఎర్రగా బుర్రగా ఉంటాడని, ప్లాస్టిక్ బొమ్మలాగ. అతను తమ్ముడైనందుకు లోపల్లోపల అక్క సిగ్గుపడుతోందని కూడా అతని అనుమానం.

ఇంటికి చేరగానే పుస్తకాల సంచి టేబిల్మీద పారేసి బట్టలు విప్పేసి బాత్రూంలో దూరతాడు. షవర్ కింద నిలబడి గోడకు బిగించిన నిలువుటద్దంలో చూసుకుంటాడు. ఎంత మునిగాళ్ళ మీద నిలబడ్డా బొడ్డు కూడా కనబడదు. పెద్దాళ్ళకోసం ఎత్తుగా బిగించుకున్నారు ఆ అద్దం. కుళాయి కిందున్న ముక్కాలి పీటమీద ఎక్కి చూసుకుంటాడు. బెలూన్లాంటి పొట్ట, గోళీల గొయ్యిలాగ బొడ్డు, పొట్టి గుండ్రటి చేతులు, టొమాటోలాగ ఉబ్బిన మొగం, చిన్న ఏనుగు కళ్లు, మరిచిపోయి తరవాత అతికించినట్టున్న గాజుగోళీలాంటి ముక్కు. నాకు సుందరమూర్తని ఎందుకు పేరెట్టారు మీరు – అని తల్లి నోసారి అడిగాడు. తల్లి ఆప్యాయంగా నవ్విందంతే. తండ్రి మాత్రం – నువ్వు నిజంగా సుందరమూర్తివి గనుక – అన్నాడు. వేళాకోళం చేస్తున్నాడు నాన్న. అక్కని గారంచేసినట్టు తన నెప్పుడూ గారం చెయ్యడు. అక్కంటే ఇంట్లో అందరికీ యిష్టం. గర్వం. అందంగా ఉంటుందని. అమ్మ మాత్రం అతన్ని ముద్దుచేస్తూనే ఉంటుంది. ఇష్టంకొద్దీ కాక జాలికొద్దీ అని అతని అనుమానం.

ఓ రోజు, ఆదివారం కాబోలు, చిలకమర్తివారి గణపతి వస్తోంది రేడియోలో – లతక్క, మరో ముగ్గురు ఆమె దోస్తీలు విరగబడి నవ్వుకుంటున్నారు అది వింటూ. రాయి ఎత్తాడు రేడియో పగలగొట్టెయ్యాలని. చటుక్కుని అమ్మొచ్చి తీసుకుపోయింది.

పెద్ద పందిరిమంచంమీద అమ్మ ముఖంతో సమంగా పైకి పాకి పడుకోవొచ్చు. అలా చూస్తే అమ్మ ముఖం ఎంతో బావుంటుంది. కింద నిలబడి పైకి చూస్తే ఇంకోలా వుంటుంది. కాని అప్పుడూ బావుంటుంది. నాన్న ముఖం మట్టుకు కొట్టొచ్చినట్టుంటుంది, కిందినించి చూస్తే, గట్టి దవడలు, దళసరి కనుబొమలు అదీ. నాన్న బావుండడని నిర్ధారణ చేసుకోవాలనుంటుంది. కాని అంతా నాన్న అందగాడంటారు. కాత్యాయినీ శంకర్రావూ మహా చక్కని జంట, పార్వతీ పరమేశ్వరుల్లాగ, అంటారు అందరూ. అందుకే అతన్ని గణపతి అంటారు, వాళ్ళ కొడుకు గనక. ఆ పేరంటే అతనికి తిక్క.

పొడుంకాయి మేష్టారు ఎప్పుడూ అతన్ని ఎద్దేవ పట్టిస్తూంటారు. ఆయనే అసలు అతనికి చిలకమర్తివారి గణపతి అని పేరుపెట్టింది. ఆయ నేదో మహా అందంగా ఉన్నట్టు, బొర్రముక్కు ఆయనా.

ముసిలి పనిమనిషి ఒక్కతే, అతన్ని నిజంగా ముద్దుచేస్తుంది. అందర్నీ వేళాకోళం చేసినట్టు అతన్నీ చేస్తుంది గాని, అందులో విషం లేదు. ఆమె కూడా తనలాగే అనాకారి. అంచేత

అతనికి దగ్గర. ఆమె ఒక్కత్తే నాన్నని ఎదిరించి మాట్లాడగలదు. ఆయన్ని ఎత్తుకుని పెంచిందట, అందుకని. అంచేత ఆమె అంటే గౌరవం కూడా. వరండాలో ఆమె పక్కని పడుకుంటే, ఎన్నో నవ్వొచ్చే కథలు చెపుతుంది. రోజూ ఆమె మనవలు వొస్తుంటారు, సాయంత్రం. తన ఈడువాళ్ళే. మిగిలిపోయిన అన్నం కూరలు పట్టుకుపోతుంటారు. సన్నగా ఊచల్లా ఉంటారుగాని, మంచి బలం ఉంది వాళ్ళకి. ముఖ్యంగా కుక్క — కుక్కేశ్వరరావు. అక్క వాణ్ణి 'కుక్కా' అంటుంది. కాని వాడేం పట్టించుకోడు. వాడికేం అభిమానం లేదా? పడి ఎందుకూరుకుంటాడు? వాడంటే చాలా ఇష్టం తనకి. అబ్బో! వాడి దగ్గర ఎన్ని విద్యలున్నాయని? ఎంత నున్నని గోడనయినా సరే, కొబ్బరి చెట్టయినా సరే, ఉడతలాగ ఎక్కెయ్యగలడు. నీట్లో మునిగి చేపలాగ ఎంతసేపైనా ఉండగలడు. ఇన్ని శక్తులున్నా, కుక్క అతన్ని తనతో సమంగా చూస్తాడు, తక్కువగా చూడడు. తన క్లాసులో ఇతర అమ్మాయిలూ అబ్బాయిలికన్న. పుల్లి మనుమలు ఎంతో పెరిగినట్టు అనిపిస్తారు అతనికి. పెద్దాడు సాంబు కుక్క అంత చలాకీగా ఉండడుగాని, ఎప్పుడూ ధీమాగా నవ్వుతూ ఉంటాడు. స్కూలు వొదిలిపెట్టాక అప్పుడప్పుడు సుందర్ - అదే గణపతి-వాళ్ళతో ఆడుకోడానికి పోతుంటాడు. వాళ్ళ స్నేహితులున్నారు ఎందరో. రకరకాల ఆటలు ఆడుతుంటారు. బస్సుస్టాండు దగ్గర, కూరల మార్కెట్టులోనూ, సామాన్లూ సరుకులు మోసి పావలా బేడా సంపాయించి ఇళ్ళ దగ్గర ఇస్తుంటారు. ఆడుతూ పాడుతూ సంపాయిస్తారు. అప్పుడప్పుడు ఎవరూ చూడకుండా ఉంటే ఇవీ అవీ కొట్టేస్తూ వుంటారు కూడా. తడుముకోకుండా అబద్ధాలు చెప్పేస్తుంటారు. వాళ్ళ ధైర్యం చూస్తే సుందర్‌కి వింతగా వుంటుంది. లోలోపల వాళ్ళమీద గౌరవం కూడా. వాళ్ళ భాష వింటే మొదట అతనికి అసహ్యం వేసేదిగాని, క్రమంగా అందులో విచ్చలవిడితనం అతన్ని ఆకర్షించింది. వాళ్ళకి బూతుపాటలు ఎన్నో వొచ్చు. క్రమంగా అతనికీ అవి ఎబ్బెట్టుగా అనిపించడం మానేశాయి. అన్నిటికన్న అతన్ని వాళ్ళలో ఎవరూ తక్కువచూపు చూడలేదు, ఎద్దేవ పట్టించలేదు - మొదట వాళ్ల కాస్త దూరంగానే వుండేవారు - కాని సాంబు మూలంగా అతను వాళ్ళలో ఒకడైపోయాడు.

ఊరి చివర కానూరుమెట్టమీదికి పోతుంటారు వాళ్ళంతా ఒకో రోజుని. తనూ పోతాడు వాళ్ళతో. స్కూలు పిల్లలతో కలిసి ఆడుకోటం అతనికి కిట్టదు. అందరూ తనని వెక్కిరిస్తారు. ఒకసారి వాళ్ళమీద పడి రక్కేశాడు కూడా. వాళ్ల అతనిమీద పడి చొక్కా చింపేశారు - ఆ రోజు మొదలు స్కూల్లో ఆడ్డం మానేశాడు. కానూరుమెట్ట ఎక్కడం కష్టం. జోళ్ళతో అసలు ఎక్కలేరు ఎవరైనా సరే. వాళ్ల మేకల్లాగ ఎక్కేస్తారు. అతను కూడా జోళ్ల తీసిపారేసి ఎక్కడం నేర్చుకున్నాడు. అక్కడ రకరకాల ఆటలు. ఒకళ్ళకొకళ్ల తోసుకుని కిందికి దొర్లిపోతుంటారు - దొర్లేటప్పుడు దెబ్బలు తగలవు వాళ్ళకి. ఓ రోజు తనూ దొర్లాడు. మోకాళ్ళు కొట్టుకుపోయాయి. తరవాత సులువు తెలిసింది. కానూరుమెట్టమీద నిలబడితే పెద్ద మేడలు కూడా అగ్గిపెట్టెల్లా కనబడతాయి. దూరాన్న రైలు దారి. రోకలిబండల్లా పాకిపోతుంటాయి రైళ్ళు. గొంతెత్తి హాయిగా పాడుకోవచ్చు అక్కడ. వొద్దనేవాళ్ల లేరు.


ఓ రోజుని తోటలో చెట్టెక్కి గొంతెత్తి పాడుతుంటే నాన్న విన్నాడు. ఆ వెధవపాట ఎక్కడ నేర్చుకున్నావని దండించాడు. తను చెప్పలేదు. అక్క మాత్రం చెప్పేసింది, తను ఆ కుక్కగాడితో తిరుగుతున్నాడని. వాళ్ళతో తిరగొద్దని నాన్న ఆర్డరు వేశాడు. కుర్రాడు వాడికేం తెలుసు - అంది అమ్మ. వాడు చూడు ఎంత హుషారుగా పాడుతున్నాడో ఆ బూతుపాట. వాళ్ళతో తిరిగాడంటే రేపు బూతుపనులే చెయ్యొచ్చు నీ కొడుకు-అన్నాడు నాన్న.

నాన్నమీద కసి. ఆ రాత్రి భోజనాలయాక వెళ్ళి అమ్మా నాన్నా పడుకునే పందిరిమంచంమీద పడుకున్నాడు. అమ్మా నాన్నా వొచ్చేసరికి నిద్ర నటించాడు. పిలిచినా లేవలేదు. అమ్మ పక్కని కూర్చుని ఆప్యాయంగా తల నిమిరింది. ఎంతో బావుంది. ఎందుకో ఏడుపొచ్చింది. నాన్న చూస్తే అవమానం, అందుకని అణుగదొక్కేశాడు. నాన్న రాగానే గట్టిగా కుదిపి లేపేశాడు. అమ్మ - పోనీ పడుకోనీ కూడదా - అంది. పాలుతాగే పిల్లాడా - అన్నాడు నాన్న చిరాకుగా. అతనికి ఆవేశం ఆగలేదు - గట్టిగా గొంతెత్తి ఏడుస్తున్నానని ఇష్టమొచ్చినట్టు తన్నేశాడు. నాన్న అతని రెక్కపట్టుకుని గది అవతలి కీడ్చి తలుపు గడియ పెట్టేశాడు. పిచ్చిగా అరుస్తూ తను తలుపుబాదడం మొదలుపెట్టాడు. పుల్లి వొచ్చి సముదాయించి తీసుకుపోయింది. పక్కలో పడుకోబెట్టుకుని చెప్పింది - తన కథ. మొగుడికి పుల్లంటే చిన్న చూపు. బావుండదని. ఎక్కడెక్కడో తిరిగి రాత్రి పొద్దుపోయి వొచ్చేవాడు. రవంత మాటంటే చాలు, తన్నేవాడు. తను వాణ్ణి తోసిపారేసి తలుపువేసేసేది. మర్నాడు పొద్దున తప్పయిపోయిందని ఏడిచేవాడు. చివరికి లొంగిపోయేది. సుందర్‌కి ఇదంతా వింతగా వుంది.

మొగుడిమీద అంత కోపంఉంటే ఎలా లొంగిపోయేది? తను బావుండదని అంటే పడి ఎలా ఊరుకునేది? పైగా లతక్కయ్య దాన్ని చీంబోతు అంటుంది. అన్నా పట్టించుకోదు పుల్లి. ఎందుకని? పుల్లిని అడిగాడు – నన్ను పాలుతాగే పిల్లాడా అని మంచంమీంచి లాగిపారేశాడు గదా నాన్న, తను మాత్రం పాలుతాగే పిల్లాడా? అమ్మపక్కనెందుకు పడుకుంటాడు – అని. పుల్లి బోసినోరంతా తెరిచి విరగబడి నవ్వింది. మీ నాన్నంత అయాక, అప్పుడు తెలుత్తాదిలే నీకు – అంది. అతని కా సమాధానం తృప్తిగా లేదు. అయినా పుల్లి చెప్పింది గనక ఒప్పుకున్నాడు. అలాగే నిద్రపోయాడు ఆమె పక్కని.

రోజూ మధ్యాహ్నం భోజనం స్కూలుకి పుల్లి తెస్తుంది. అతను మర్రిచెట్టుకింద కూర్చుని తింటాడు. ఓ రోజు అమ్మే తెచ్చింది కార్లో. అక్కకీ తనకీ వరండాలో బెంచీమీద కంచాల్లో కలిపి పెట్టింది. పొడుంకాయ మేస్టారు అలా పోతూ అమ్మని చూసి ఆగాడు. కుశలప్రశ్నలయాక – మీలాంటి చక్కని దంపతులికి ఇలాంటి అనాకారి ఎలా పుట్టాడమ్మా – అన్నాడు నవ్వుతూనే. సుందర్‌కి పులుసుగిన్ని ఆయన ముక్కుమీదికి విసిరెయ్యాలనిపించింది. కంచం తీసుకుని మర్రిచెట్టుకింది కెళ్ళిపోయాడు, పుల్లిదగ్గరికి. పుల్లి తల నిమురుతూ చెప్పింది – తనకి ఓ బుల్లితమ్ముడు పుడతాడని. తనలా ఉంటాడా, అక్కయ్యలా వుంటాడా బుల్లితమ్ముడు?


ఆ తరవాత అమ్మకి ఓపికలేదు, అతన్ని ముద్దుచెయ్యడానికి. బరువుగా నడుస్తుంది. నీరసంగా కూర్చుంటుంది. అతనికి ఇంటిదగ్గర అసలే తోచడం లేదు. కానూరుమెట్టమీదికి రోజూపోడం మొదలెట్టాడు. ఓ రోజు రాత్రంతా పుల్లివాళ్ళ యింటిదగ్గర డముకుల కథ వింటూ కూర్చున్నాడు.




కాని రాత్రల్లా తను ఇంట్లో లేదని ఎవరికీ తెలియలేదు. అందరూ అమ్మ వాళ్ళ పడకగదిలో ఉన్నారు – ఏదో హడావిడి. పుల్లికూడా. గదిలోకి పోయి పడుకున్నాడు. కారు వొస్తూ పోతూ ఉన్న చప్పుళ్ళు. అమ్మకి జబ్బుగా వుందా? నిద్రపట్టలేదు చాలాసేపు. అంకెలు లెక్కెడుతున్నాడు నిద్రపట్ట డానికి. నూటఏభై రెండు దగ్గరకొచ్చేసరికి వినిపించింది కారు స్టార్టయినప్పుడు చప్పుడులాంటి ఏడుపు. ఎంతోసేపటికి పుల్లి వొచ్చి చెప్పింది, బుల్లితమ్ముడు పుట్టాడని. ఎలా ఉంటాడు తమ్ముడు?

అతను గదిలోకి వొచ్చేసరికి లేడీ డాక్టరు నాన్నకి చెపుతోంది – అచ్చు తల్లిపోలిక. మంచి అందగాడవుతాడు. అతను ఉయ్యాలవైపు చూశాడు. గుడ్డల మధ్యనించి ఎర్రటి ముద్దలా కనబడ్డాడు తమ్ముడు. అతనికింక ఆ గదిలో ఉండాలనిపించలేదు. తోటలో తిరుగుతూ లేతచిగుళ్ళని పేటాడిపారేస్తూ తిరిగాడు స్కూలుటైం అయ్యేదాకా.

మధ్యాహ్నం భోజనాలప్పుడు స్కూల్లో తన స్నేహితులతో గొప్పగా చెప్పేస్తోంది లతక్క – బుల్లితమ్ముడు ఎంత బావుంటాడని. అచ్చు మా అమ్మే. చంద్రం సుందర్‌ని వేళాకోళం చెయ్యడం మొదలెట్టాడు. అతను మెదలకండా ఊరుకున్నకొద్దీ చంద్రం మరింత ఏడిపించడం మొదలెట్టాడు. పిల్లలంతా నవ్వడం మొదలెట్టారు. సుందర్ అప్పటికీ ఊరుకున్నాడు. తరవాత చంద్రం తన డ్రెస్సు అందరికీ చూపిస్తూ ఎవరో వాళ్ళ నాన్న స్నేహితుడు అమెరికానించి తెచ్చి ఇచ్చాడని చెప్పాడు. అది అమెరికాలో కూడా అన్నిచోట్లా దొరకదట. చంద్రం కోసం ప్రత్యేకంగా అమెరికా అంతా వెతికి తీసుకొచ్చాట్ట. అందరూ ఆ డ్రెస్సు మెచ్చుకుంటున్నారు. లతక్క కూడా. చంద్రం లతక్కకి కూడా ఓ మాంచి డ్రెస్సు తెప్పించిపెడతానన్నాడు. అని ఊరుకోలేదు. సుందర్‌తో అన్నాడు – నీకూ తెప్పించి పెడతాలే. దిష్టిబొమ్మలకి తొడిగేవి కూడా ఉంటాయి. సుందర్ పెన్‌మూత తీసి టపీటపీ నాలుగుసార్లు చంద్రం డ్రెస్సు మీద విదిపేశాడు, కసికొద్దీ. చంద్రానికి దుఃఖం కోపం. అమాంతంగా మీదపడ్డాడు. సుందర్ బాగా దెబ్బలు తిన్నాడుగాని, చంద్రం డ్రెస్సు ఇష్టంవొచ్చినట్టు పీలికలు చేసి పారేశాడు. చంద్రం ఏడుస్తుంటే సుందర్‌కి కడుపు విండినట్టుంది.




హెడ్‌మేస్టారికీ నాన్నకీ ఫిర్యాదు వెళ్ళింది. నాన్న వొచ్చాడు స్కూలుకి. చంద్రం డ్రెస్సు ఖరీదు ఇచ్చి అతన్ని సముదాయించాడు. సుందర్ని ఇంటికి తీసుకుపోయి ఓ గదిలో పారేసి గొళ్ళెంపెట్టేశాడు. అన్నం నీళ్లు కూడా వాడికి ఇవ్వడానికి వీల్లేదన్నాడు. చాటుగా పుల్లి అన్నం కలిపి తీసుకొచ్చింది. కాని సుందర్ తినలేదు. అతనికి అందరిమీదా తిక్కగా ఉంది. పుల్లిమీద కూడా. తను కూడా అతను చేసిన పని తప్పంది. తల్లి వచ్చి పిలిచింది. అతను పలకలేదు. లోపల గడియవేసుకున్నాడు. విసుగెత్తి వెళ్ళిపోయింది తల్లి.

గదిపక్కని బాత్‌రూం ఉంది. లోపలి కెళ్ళి కుళాయి నీళ్లు కడుపునిండా తాగాడు. బాత్‌రూంకి చిన్న కిటికీ ఉంది, కక్కుస్‌పైన. కక్కుస్‌మీది కెక్కి కిటికీలోంచి అవతలిచూశాడు. కిందదాకా ఇనుపగొట్టం వుంది. కిటికీలోంచి అవతలికి దూకి గొట్టంపట్టుకుని జర్రుని కిందికి జారాడు – చొక్కా చిరిగి పోయింది, రొమ్ముమీద చర్మం గీసుకు పోయింది రాపిడికి. అయినా అతనికి నొప్పి తెలియలేదు. అందరినీ టోకరా తినిపించానని గర్వం – సంతృప్తి.

కానూరుమెట్టమీద ఒక పడిపోతున్న గుడిసె ఉంది, ఎవరు కట్టుకున్నారో. ఇప్పుడందులో ఎవరూ లేరు. లోపలి కెళ్ళి అందులో నేలమీద పడుకున్నాడు. రకరకాల ఊహలు. అమ్మా నాన్నా కంగారుపడుతుంటారు – అమ్మ నాన్నని తిడుతుంది – పుల్లి నాన్నని తిడుతుంది. అందరికీ తగిన శాస్తి. కసితో రెండు రోజులు కడుపు నింపుకున్నాడు. అప్పు డప్పుడు నిద్ర వొచ్చేది–మళ్ళీ ఊహలు – మళ్ళీ నిద్ర. నిద్రలో కూడా అవే కలలు – ఆఖరికి శరీరం మనసు అలిసి పోయి కలలులేని మగత నిద్రలో మునిగిపోయాడు.

మళ్ళీ మెలకువ వొచ్చేసరికి తన గదిలో మంచంమీదున్నాడు. డాక్టరు ఇచ్చిన ఇంజక్షను చుర్రుమంది. అతడు కళ్ళు తెరవడంతోటే నాన్న – ఒరే వెధవా – అని దగ్గరగా వొస్తున్నాడు. అమ్మ నాన్నవంక కొరకొరా చూసింది. ఆగిపోయాడు – మంచంమీద కూర్చుని అతని ఒళ్ళు నిమిరింది. ఇంతలో పుల్లి వొచ్చింది వెచ్చని కాఫీ పట్టుకుని. అందర్నీ అవతలికి వెళ్ళమంది, అమ్మని కూడా. బిడ్డని కాస్సేపు నిద్దురోనివ్వండి అంది. పక్కని కూర్చుని లేవదీసి కాఫీ పట్టించింది.


ఇంట్లోనూ స్కూల్లోనూ అతను ఎవరితోనూ మాట్లాడ్డం మానేశాడు. పుల్లితో కూడా. స్కూల్లో అతన్ని ఎవరూ ఏమీ అనడంలేదు. కాని తక్కిన వాళ్ళకీ అతనికీ దూరం పెరిగిపోయింది. ఇదివరకు వాళ్లు ఎద్దేవపట్టించినా, అతను వాళ్ళమీద పడ్డా, ఏదో దగ్గర తనం వుండేది, చనువులాంటిది. ఇప్పుడది లేదు. సాంబు కుఱ్ఱా కూడా ఇదివరకు లాగ అతనితో చనువుగా లేరు. ఒక్క పుల్లే అసలు ఏమీ జరగనట్టుగా అతన్ని పలకరించేది, నవ్వుతూ మాట్లాడేది.

ఓ రోజుని టీచరొచ్చి తండ్రితో చెప్పాడు అతనేమీ చదవడంలేదని. నాన్న కేకలేశాడు. అమ్మ బాగా చదుకోవాలి, మంచి పేరు తెచ్చుకోవాలి– అని ఎన్నో విధాల బుజ్జగిస్తూ చెప్పింది. వాళ్ళంతా తన్ను గురించి ఆందోళన పడుతున్నారని అతనికి తెలుసు. కాని తిక్క – వాళ్ళకంతే జరగాలి. అందరూ అతన్ని తలోరకంగానూ హెచ్చరిస్తుంటే, పుల్లి అందర్నీ కేకవేసింది. అతన్ని ఎవ్వరూ ఏమీ అనడానికి వీల్లేదంది. అతనే బంగారంలాగ చదువుకుంటా డంది.

ఓ రోజు ఏం తోచలేదు సుందర్‌కి. అందరూ తలో పనిలోనూ ఉన్నారు. ఇల్లంతా తిరిగాడు. పెద్ద పడకగది దగ్గరకొచ్చాడు. తమ్ముణ్ణి పరీక్షగా చూడాలని బుద్ధిపుట్టింది. లోపలి కెళ్లాడు. అమ్మ బాత్‌రూంలో ఉన్నట్టుంది. మంచం మీద రబ్బరుగుడ్డేసి పడుకోబెట్టారు తమ్ముణ్ణి. పైన దోమతెర గొడుగు. దోమతెరలోంచి చూస్తుంటే మరీ బాగు న్నాడు. కాటుకెట్టిన కళ్లు ఎంత ముద్దుగా ఉన్నాయో. ఇంతలో అతని చూపుకి అడ్డంగా రెండు దోమలు ఎగరడం మొదలుపెట్టాయి – ఓసారి తోలేశాడు – మళ్ళీ ముక్కుచుట్టూ ఎగరడం మొద లెట్టాయి. చిరాకు కోపం పుట్టుకొచ్చాయి. ఒడుపుగా రెండుచేతుల మధ్య వాటిని హతమార్చాలని జాగర్తగా గురి చూసి టపీమని చప్పట చరిచాడు. దోమలు

ఏమయినాయో తెలియదుగాని, దోమతెర గొడుగు టప్పుమని ముడుచుకుపోయి చంటితమ్ముడిమీద పడింది. వాడు కేరుమన్నాడు. బాత్‌రూంలోంచి అమ్మ కంగారుగా పరిగెత్తుకొచ్చి గుక్కపట్టి ఏడుస్తున్న చంటాణ్ణి గుండెలకు హత్తుకుంది. బిత్తరపోయినట్టు సుందర్‌వంక చూసింది - వాడు చంటాణ్ణి చంపినంత పని చేశాడన్నట్టు. నే నూరికే దోమల్ని చంపాలనుకున్నాను - అని అరవాలనిపించింది. కాని అతని గొంతు పెగల్లేదు. నాన్నొచ్చాడు హడావిడిగా. అవతలికి ఈడ్చుకుపోయి బెల్టు తీశాడు కొట్టడానికి. పుల్లి వొచ్చి అడ్డుపడింది. తనతో వంటింటి వసారాలోకి తీసుకుపోయింది. ఎంతోసేపు చూశాడు ఏం జరిగిందని అడుగుతుందేమోనని - పుల్లి అడగనే లేదు. తన పని తను చేసుకుంటూ కూర్చుంది. ఆఖరికి ఉండబట్టలేక అతనే అన్నాడు - దోమల్ని చంపాలని చప్పట చరిస్తే దోమతెరకి తగిలింది. అది ముడుచుకుపోయి తమ్ముడిమీద పడింది. తమ్ముణ్ణి నేనేం చెయ్యలా. తెలుసన్నట్టు తల వూపింది. నవ్వుతూ అతనివంక చూసింది. ఎగిరి గంతెయ్యాలన్నంత ఆనందం వొచ్చింది అతనికి. గంతులేస్తూ తోటంతా తిరిగాడు.

వి నా య క చ వి తి వొస్తోంది. నవరాత్రులు జరపడానికి బస్సుస్టాండు వీధిలో పెద్ద పందిరి వేస్తున్నారు. ప్రతి రాత్రీ హరికథలు పాటకచ్చేరీలు ఉంటాయి. బజారులో రోడ్డుపక్కన ఎన్నో గణపతి బొమ్మలు, మట్టివి, ప్లాస్టర్‌వి, పింగాణీవి, రకరకాలు. రకరకాల గొడుగులు. ఆ బొమ్మల్ని చూస్తుంటే చటుక్కుని సుందర్‌కి అనిపించింది-తనకీ గణపతికీ ఎన్నో పోలికలు ఉన్నాయని. కాని అంత అనాకారి అయినా గణపతి అంటే అందరికీ ఇష్టం. పుల్లి నడిగాడు. ఆమె చెప్పింది.




ఓనాడు సాయంత్రం తానాని కెడతోంది బాత్‌రూంకి. ఇంట్లో ఎవ్వరూ లేరు. ఈధితలుపులేసేత్తే ఆయనగా రొస్తాడేమో. అంటే శివుడు. తలుపేసుంటే మూడోకన్ను తెరుత్తాడు. అసలే ఆయనగారికి ముక్కుమీదుంటది కోపం. ఏంజేసిందప్పుడు ? సున్నిపిండితో ఓ అబ్బాయిని చేసి, దానికి పేణం పోసింది. మహా ముద్దుగా ఉన్నాడు కుర్రోడు. ఆడితో అందిగదా-ఒరే ముద్దులకొడకా, ఈదిగుమ్మంకాడ కాపలా ఉండు. నేను తానం చేసొచ్చేదాకా ఎవర్నీ లోనికి రానీమోక, అంది.

ఆవిడగారు తానాని కెళ్ళింది. ఆడు గుమ్మంలో కూసున్నాడు. పాపం ఆడి రాతకొద్దీ అమ్మోరి తానం పూర్తి కాకుండానే శివుడు తిరిగొచ్చాడు - కుర్రోడు అడ్డగించాడు. అమ్మోరి ఆడ్డరన్నాడు - శి వు ని కి ఒళ్ళుతెలీని కోపం వొచ్చి - ఓరి కుర్రనాయాలా! నా ఇంట్లోకి నేనే రావటాని కీల్లేదని సెప్పటానికి నువ్వెవడివిరా. సూసుకో నా తడాకా - అని - సేతులో త్రిసూలం ఉంటదిగా - దాంతో ఒక్కటే ఏటు ఏసేసాడు - అంతే కుర్రోడి తల ఎగిరెళ్ళి పద్దానుగులోకాల కావల ఏడనో పడిపోయింది. ఇంతలో పార్వతమ్మొచ్చి లబోదిబోమంది. తన పెద్దబిడ్డంది. ఆడు పోతే నే నెట్టా బతికే దంది. పాపం శివునికి మతోయింది, ఎట్టా పార్వతమ్మని ఊరుకోబెట్టటం? పోనీ తల అతికేసి పేణం పోద్దామంటే యాడని వెతికేది? అందుకని ఏంజేసాడంటే, ఓ ఏనుగు తలనరికేసి కుర్రోడిమొండానికి అతికించి పేణం పోసాడు - అందుకని గణపతికి ఏనుగు తల.

ఆ కథ వింటుంటే సుందర్‌కి మహా ఉత్సాహంగా ఉంది. వింటున్నంతసేపూ, అమ్మా నాన్నా పార్వతీ శివుడూ అయినట్టు, తను గణపతి అయినట్టూ ఊహించుకున్నాడు, కాని ఓ అనుమానం వొచ్చింది. పుల్లి నడిగాడు. ఏనుగు తలవున్న బిడ్డ ఆ బిడ్డంటే పార్వతీదేవికి ఇష్టం ఎలా వుంటుందని. పుల్లి అంది - కడుపుని పుట్టిన బిడ్డ ఎట్టాగున్నా సరే, తల్లికి పేమలేకండా ఎట్టా పోద్ది? తల్లి కళ్ళకి బిడ్డ ఎప్పుడూ అందగాడే -

చటుక్కుని సుందర్‌కి అనిపించింది. తన్ను అందరూ గణపతి అంటే తనెందుకు ఉడుక్కోవాలి? గణపతి అంటే అందరికీ ఇష్టమేగా.

సాంబు కుప్పూతో బజారు కెళ్ళి రకరకాల గణపతి బొమ్మలు కొనుక్కొచ్చాడు సుందర్. పూజకి రకరకాల పత్రిపువ్వులూ సంపాదించాడు-పాలవెల్లి బ్రహ్మాండంగా అలంకరించి కట్టాడు,

వాళ్ల సాయంతో. పూజకి సాంబుని కుక్కనీ కూడా రమ్మన్నప్పుడు, నాన్న అడ్డు చెప్పలేదు. పూజ అయాక వాళ్లతో కలిసి పాటలు పాడాడు – బలే ఎలక సవారీ ఎలా ఎక్కుతావో, చలో అంటు ప్రతీ ఇంట ఎలా తిరుగుతావో – అన్న పాట మరీ ఇష్టం అతనికి. రేడియోలో ఎప్పుడో విన్నాడు. పురోహితుడు కథ చదువుతుంటే విన్నాడు. కైలాసంబున కుబ్జరూపధరుడైయున్న వినాయకుని జూచి చంద్రుండు నవ్వి – అనగానే చంద్రం గుర్తుకొచ్చాడు – స్కూలు కాంపౌండులో వాడు నవ్వినట్టు, తను వాణ్ణి పచ్చడికింద కొట్టినట్టు వాడు తన కాళ్ళమీద పడి రక్షించమని వేడుకున్నట్టు తను వాణ్ణి క్షమించి వొదిలిపెట్టినట్టు పగటికల. సుందర్ ముఖంమీద వెన్నెల్లాంటి నవ్వు చూసి అమ్మా నాన్నా అమ్మయ్య అనుకున్నారు.

స్కూల్లో అటెండెన్సు వేస్తూ మామూలు అలవాటుకొద్దీ పొడుంకాయ మేస్టారు తనపేరొచ్చినప్పుడు 'గణపతీ' అని పిలిస్తే అతను "ప్రెజెంట్ సార్," అని పలికాడు – ఆయనకే ఆశ్చర్యం వేసింది. ఇదివర కెప్పుడూ కోపంతో బిగిసిపోయి చూచునేవాడు.

సాయంకాలం స్కూలు గ్రౌండ్‌లో ఇతర పిల్లలతో కలిసి చెడుగుడు ఆడాడు. ఆటలయాక అక్కతోటీ చంద్రంతోటీ కలిసి ఇంటికొస్తూ పుల్లి చెప్పిన కథలు చెప్పి వాళ్ళని నవ్వించాడు.

ఇంటికొచ్చి పుస్తకాలు బల్లమీద పారేశాడు. బాత్‌రూంలోకి వెళ్ళి స్నానం చేశాడు. ఈసారి ముక్కాలిపీట ఎక్కి అద్దంలో చూసుకోలేదు. డ్రెస్సు మార్చుకుని వొస్తుంటే పెద్ద మంచంమీద కేరింతాలు కొడుతున్న బుల్లితమ్ముడు కనిపించాడు – మంచం ఎక్కి వాణ్ణి ఒళ్ళోకితీసుకున్నాడు. కిచకిచలు పెట్టాడు– వాడు నవ్వుతుంటే వాడితోపాటు తనూ నవ్వాడు – సుందర్ నవ్వులు పసివాడి కేకలు విని అందరూ వొచ్చారు గుమ్మంలోకి, నాన్న, అమ్మ, లతక్క, పుల్లి – అందరూ. అమ్మ ఉద్వేగంగా వొచ్చి ఇద్దరు బిడ్డల్నీ గట్టిగా గుండెలకు హత్తుకుంది.

"అమ్మా! అలా నలిపెయ్యకు బుల్లి తమ్ముణ్ణి – ఊపిరి సలపదు," అన్నాడు – నాన్న వొచ్చి ఆప్యాయంగా అతని తల చెరిపేశాడు – అక్క వొచ్చి ముందు తమ్ముణ్ణీ తరవాత అతన్నీ ముద్దుపెట్టుకుంది. తమ్ముడివంక చూస్తూ అమ్మతో అన్నాడు –

"అమ్మా! తమ్ముడంత అందమైన వాళ్లు ఎక్కడా ఉండరు."

అమ్మ కంటతడితో అంది –

"కాదు బాబూ! నీకన్న అందమైన వాడు కాదు బుల్లి తమ్ముడు."

